

సాక్షి రంగారెడ్డి

శనివారం । 4 । మే । 2024



చేవెళ్ల భూములపైనే చూపు

రంజిత్‌రెడ్డి చూపు చేవెళ్ల ప్రాంతంలోని భూములపైనే కాని ప్రజలపై కాదని బీజేపీ నేత కేఎస్ రత్నం ఆరోపించారు. 10లో▸



సేవా దృక్పథం ఉండాలి

ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్ సూచించారు. 10లో▸



కాంగ్రెస్‌తోనే రక్షణ

కాంగ్రెస్‌తోనే రిజర్వేషన్లకు రక్షణ అని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

భువనగిరి లీగల్ సెల్ కో ఆర్డినేటర్‌గా దేవాగౌడ్



నియామకపత్రం అందుకుంటున్న దేవాగౌడ్

ఇబ్రహీంపట్నం: భువనగిరి లోక్‌సభ లీగల్ సెల్ కో–ఆర్డినేటర్‌గా అదిబట్లకు చెందిన టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ దేవాగౌడ్‌ను నియమిస్తూ ఆ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవాగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన అశోక్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెంటే

మనో విజ్ఞానశాస్త్ర నిపుణుడు ప్రొఫెసర్ రాధాకృష్ణారావు



సదస్సులో మాట్లాడుతున్న రాధాకృష్ణారావు

షాద్‌నగర్‌రూరల్: ఏదైనా నేర్చుకోవాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెంటే ఉంటాయని మనో విజ్ఞాన శాస్త్రనిపుణుడు ప్రొఫెసర్ రాధాకృష్ణారావు సూచించారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం మనో విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు హాజరైన ఆయన డిగ్రీ, పీజీ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాస విజ్ఞానం పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. యువత పాశ్చాత్య పోకడలవైపు పయనించొద్దని, సమాజం హితవు కోరే విధంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా విద్యపై ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్

బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశాన్ని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ఉన్న నాయకుడు నరేంద్రమోదీ అని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని శంకర్‌పల్లి, బుల్కాపూర్ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. వీరికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికోసం నిరంతరం పరితపించే నాయకుడు మోదీ అన్నారు. ఈసారి కూడా కేంద్రంలో మోదీ సర్కారే ఖాయమని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బి.నర్సింహ, వాసుదేవ్‌కన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత మెట్రో రెండో దశ

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల అనంతరం మెట్రో రైల్ రెండో దశ ప్రాజెక్టుపై కార్యాచరణ చేపట్టనున్నట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రెండో దశపై ఇప్పటికే డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత కేబినెట్ అనుమతి కోసం డీపీఆర్‌ను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కేంద్రం ఆమోదంతో మెట్రో రెండో దశ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఎల్బీనగర్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు మెట్రో రెండో దశ పనులను త్వరలో చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

చిరుత చిక్కెన్







శంషాబాద్: ఆరు రోజులుగా అటవీ, ఎయిర్‌పోర్టు అధికారులకు.. సమీప గ్రామస్తులకు ముచ్చెమటలు పట్టించిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. బోనులో ఎరగా వేసిన మేకతో పాటు మాంసం కోసం వచ్చి దొరికిపోయింది. గత శనివారం అర్ధరాత్రి గొల్లపల్లి సమీపంలోని మూడు అడుగుల ఎత్తు ఉన్న ఎయిర్‌పోర్టు ప్రహరీ దూకి ఎయిర్‌పోర్టులోకి చిరుత ప్రవేశించినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. అదే రోజు రాత్రి రన్‌వేకు అత్యంత సమీపంలో సంచరించినట్లు గుర్తించిన ఎయిర్‌పోర్టు భద్రతాధికారులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. తొలుత చిరుతా? అడవి పిల్లినా? అని అనుమానించిన అధికారులు సీసీ కెమెరాల్లో స్పష్టమైన ఆనవాళ్లు కనిపించడంతో చిరుతగా నిర్ధారించి పట్టుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. మొదట రెండు బోన్లను మాత్రమే ఏర్పాటు చేసిన అధికారులు రెండు రోజుల తర్వాత చెట్లు దట్టంగా ఉన్న ప్రాంతాల్లో మొత్తం అయిదు బోన్లను పెట్టారు. 25 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా బోన్ల వద్ద మేక మాంసంతో పాటు మేకను కూడా ఎరగా వేస్తూ వచ్చారు. రెండు రోజుల క్రితం చిరుత బోన్లకు అతి సమీపంలోకి వచ్చినా లోనికి వెళ్లలేదు. గురువారం రాత్రి 8 గంటల సమయంలో రన్‌వేకు రెండు కిలోమీటర్ల దూరంలో చిన్నపాటి కొండలా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోను సమీపంలోకి వెళ్లింది. తొలుత బోను చుట్టూ రెండు చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత బోనులో ఉన్న మేకను చూసిన చిరుత అందులోకి ప్రవేశించిన వెంటనే వాటి గ్రిల్స్ ఒక్కసారిగా మూసుకుపోయాయి. దీంతో చిరుత చిక్కినట్లయింది.

కుందేళ్లు, నెమళ్లను తింటూ..

శుక్రవారం ఉదయం ఎఫ్‌డీఓ విజయానంద్‌రావు మాట్లాడుతూ.. ఆరురోజులుగా విమానాశ్రయం లోపలి ప్రాంతంలోనే చిరుత సంచరించినట్లు నిర్ధారించారు. సుమారు మూడేళ్ల వయసున్న మగ చిరుతగా గుర్తించినట్లు తెలిపారు. ఆరు రోజులుగా ఏడు మీటర్ల ఎత్తున్న గడ్డి ప్రాంతంలో ఎక్కువగా ఇది సంచరించిందని పేర్కొన్నారు. కుందేళ్లు, నెమళ్లను తింటూ ఆకలి తీర్చుకుందన్నారు. సమీపంలో నీటి గుంతలు కూడా ఉండడంతో దాని దాహానికి కూడా ఎలాంటి ఇబ్బందులు కలగలేదన్నారు. చిరుత పూర్తి ఆరోగ్యంతో పాటు ఆగ్రహంగా ఉందని ఆయన చెప్పారు. దానిని జూకు తరలించి వైద్యపరీక్షలు పూర్తి చేసిన అనంతరం అమ్రాబాద్ అడవుల్లో విడిచిపెట్టనున్నట్లు చెప్పారు. అది ఏ ప్రాంతం నుంచి వచ్చిందన్నది మాత్రం ఇంకా నిర్ధారణ కాలేదన్నారు.

పోస్టల్ బ్యాలెట్ షురూ



పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు వేస్తున్న ఉద్యోగి

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోలీస్ శాఖ ఉద్యోగులు, ఎన్నికల విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓ, ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఇందుకుగాను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈనెల 8వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటేసేందుకు అవకాశం ఉందని ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. 3,581 ఓటర్లు ఈ విధానం ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా మొదటి రోజు 33 మంది ఓటేసినట్లు చెప్పారు.

ప్రచండ‘మే’

తారెత్తిస్తున్న ఎండలు • శివారులో 45.7.. సిటీలో 44.2

తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు



సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో ఎండలు ప్రచండ‘మే’ అనేంతగా బెంబేలెత్తిస్తున్నాయి. భానుడి భగభగలు సెగలు పుట్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. సూరీడి ఉష్ణతాపానికి శుక్రవారం ‘ఫ్రై’ డేను తలపించింది. శివార్లలోని కీసరలో 45.7, చిలుకూరులో 45.2, అల్లాపూర్ వివేకానందనగర్‌లో 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత తొమ్మిదేళ్లలో ఇదే రికార్డు. 2015 మే 22న మాత్రం సికింద్రాబాద్‌లో 47.6, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఆల్‌టైమ్ రికార్డు. మహానగర సగటు ఉష్ణోగ్రత సైతం రికార్డు సృష్టిస్తోంది. మరో నాలుగు రోజుల్లో మరింత రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప పగటి పూట అడుగు బయటపెట్టొద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రుమంటుండడంతో ద్విచక్ర వాహనదారులు, ఇంట్లోని పిల్లలు, వృద్ధులు త్వరగా డీహైడ్రేషన్‌కు లోనై అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. వడదెబ్బ కారణంగా జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ నిలోఫర్ చిన్నపిల్లల ఆస్పత్రి సహా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లోని ఔట్ పేషెంట్ విభాగాలకు బాధితులు భారీగా వస్తున్నారు.

ఆల్కహాల్‌తోనూ డీ హైడ్రేషన్

సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళ బయటికి వెళ్లక పోవడమే ఉత్తమం అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అనివార్యమైతే వెంట గొడుగుతో పాటు వాటర్ బాటిల్, ఒంటికి చలువ చేసే మజ్జిగ, పండ్ల రసాలను తీసుకెళ్లాలని స్పష్టం చేస్తున్నారు. వేళకు సరిపడా నీరు తాగక పోవడం, ఉక్కపోతకు శరీరంలోని నీరు చమట రూపంలో బయటికి వెళ్లిపోతుండటంతో త్వరగా డీహైడ్రేషన్‌కు లోనవుతుండటంతో పాటు మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. ఆల్కహాల్ త్వరగా డీహైడ్రేట్ చేస్తుంది, సాధ్యమైనంత వరకు దాని జోలికి వెళ్లక పోవడమే ఉత్తమం.



వడదెబ్బ లక్షణాలివీ..

వడదెబ్బకు గురైన వ్యక్తిలో మూత్ర విసర్జనలో భరించలేని నొప్పి, కండరాల తిమ్మిరి, భారీగా చెమట పట్టడం, విపరీతమైన బలహీనత, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, అధిక హృదయ స్పందన, చర్మం పాలిపోవడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. వీరిని తక్షణమే రోగిని చల్లగా ఉండే ప్రదేశానికి తరలించాలి, రోగి చుట్టూ గుంపులు గుంపుగా ఉండకూడదు. చన్నీటి బట్ట, స్పాంజ్‌తో నుదురు, మెడ, తల భాగాన్ని తుడవాలి. వదులుగా ఉండే, తేలిక పాటి, లేత రంగు దుస్తులను ధరించాలి. దోసకాయ, పుచ్చకాయ, దానిమ్మ పండ్లను ఎక్కువ తీసుకోవాలి. ఏరోబిక్ వ్యాయామాలకు బదులు తేలికపాటి వ్యాయామాలు, ఈత ఉత్తమం. ఆరుబయట ఉంటే, నీడలో క్రమం తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలి. తరచూ నీళ్లు తాగాలి. నెత్తిన టోపీ, కళ్లకు కూలింగ్ గ్లాసులు ధరించడం ద్వారా సూర్యరశ్మి నుంచి శరీరాన్ని, కళ్లను కాపాడుకోవచ్చు.

శుక్రవారం ఉష్ణోగ్రతలు ఇలా..	కీసర	చిలుకూరు	అల్లాపూర్	కుత్బుల్లాపూర్	నాచారం	చిలకలగూడ	సరూర్‌నగర్
	45.7	45.2	44.2	44.1	44.0	44.0	43.9

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

- ఈనెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్
- కలెక్టర్ శశాంక వెల్లడి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా హోమ్ ఓటింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 54 బృందాలతో హోం ఓటింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఈనెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ శశాంక ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ సేకరణ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. ఓటింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దే ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య, పార్ట్ నంబర్ చెక్ చేసుకోవాలని అన్నారు. ఏవైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తారని చెప్పారు. ఆయన వెంట శేరిలింగంపల్లి మున్సిపల్ జోనల్ కమిషనర్ స్నేహ, డిప్యూటీ కమిషనర్, సంబంధిత అధికారులు ఉన్నారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన

జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ శశాంక పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతా పరమైన అంశాలను పరిశీలన చేశారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎఈఆర్ఓ రజినీకాంత్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇక ఈ- పేమెంట్

చెక్కుల ద్వారా చెల్లింపులకు చెల్లు



సాక్షి, సిటీబ్యూరో: వేతనాలు, పెన్షన్లు సహా అన్ని రకాల చెల్లింపులకు జీహెచ్ఎంసీ ఈ- పేమెంట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. మాన్యువల్ చెక్కుల స్థానంలో ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల లబ్ధిదారులకు ఎప్పటికప్పుడే ఖాతాలో నిధులు జమ అవుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ విధానం వల్ల పారదర్శకతతో పాటు తగిన నియంత్రణ ఉంటుందని తెలిపారు. ఇందుకుగాను ఎస్‌బీఐ క్యాష్ మేనేజ్‌మెంట్ ప్రాడక్ట్(సీఎంపీ) సేవల్ని వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. తద్వారా జీహెచ్ఎంసీ ఈఆర్‌పీ.. ఎస్‌బీఐ పోర్టల్‌తో, సీజీజీ హెచ్‌ఆర్‌ఎంఎస్ మాడ్యూల్‌తో అనుసంధానమవుతుందని, నగదు చెల్లింపుల్లో మానవ జోక్యానికి తావుండదని ఆయన తెలిపారు. ఈ–పేమెంట్ సిస్టమ్ అన్ని రకాల చెల్లింపుల్ని ప్రాసెస్ చేస్తుందని, డిజిటల్ చెల్లింపుల్లో ఇదో పెద్ద ముందడుగు అని అభివర్ణించారు.

దేవుళ్లపై ఒట్లు.. దేవుడి పేరుతో ఓట్లు

- కాంగ్రెస్, బీజేపీలవి అవకాశవాద రాజకీయాలు
- ఎన్నికల్లో ఆ పార్టీలకు గుణపాఠం చెప్పాలి
- మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఒకరేమో దేవుళ్లపైనే ఒట్లు వేసి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతుంటే.. మరొకరేమో దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి శంకర్‌పల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు నమ్మి అధికారం ఇస్తే ఈ నాయకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేయటం చూసి చేవెళ్ల వెంకటేశ్వరస్వామి సైతం ఆయన ఈ ప్రాంతానికి రాకపోతే బాగుండు అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకిని కూడా తన ఇంటి మీద వాలనివ్వనని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు రంజిత్‌రెడ్డి ఏ ఇంటి మీద కాకి అని చేర్చుకున్నాడో చెప్పాలన్నారు. నమ్మిన పార్టీని, కేసీఆర్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి రాముడి గుడి, రాముడి పేరు చెప్పి ఓట్లు వేయాలని అడుగుతున్నారని.. ప్రజలే ఈ అభ్యర్థుల తీరును గుర్తించాలన్నారు. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు తెలిసిన నాయకుడిగా లోక్‌సభలో ఈ ప్రాంత గొంతుకగా ఉంటానని.. పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ. బీఆర్ఎస్ పార్టీ అంటే ప్రజల్లో ఒక నమ్మకమని అది ఇప్పుడు ప్రజలు గుర్తిస్తున్నారని ఈ ఎన్నికల్లో దీనిని రుజువు చేసి చూపించాలన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ.. కాసానిని గెలిపించేందుకు బీసీలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంసెబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు, మండల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, గోపాల్, పాపారావు, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, నర్సింహ, వెంకటేశ్ పాల్గొన్నారు.

దేశంలో రాజ్యాంగ వ్యవస్థల విధ్వంసం

- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి
- పీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హరగోపాల్ తదితరులు

షాద్‌నగర్ రూరల్: దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు విధ్వంసానికి గురవుతున్నాయని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని దేవిగ్రాండ్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, శాసన కార్యనిర్వాహక న్యాయవ్యవస్థ విధ్వంసానికి కేంద్రంలోని పాలకులు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు నేటి పాలకులు తూట్లు పొడుస్తూ ప్రశ్నించే మేధావులు, రచయితలు, న్యాయవాదులు, జర్నలిస్టులను అక్రమ కేసులతో జైలులో నిర్బంధిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే మరింత దారుణ పరిస్థితులు తలెత్తుతాయన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మేధావులు, కవులు, రచయితలు, జర్నలిస్టులతో పాటు ప్రజలపై కూడా ఉందన్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రలోభాలకు లొంగకుండా, భయభ్రాంతులకు గురి కాకుండా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. టీపీజేఏసీ కో కన్వీనర్ రవిచంద్ర మాట్లాడుతూ.. దేశంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సరైన వ్యక్తికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరారు. డాక్టర్ వనమాల మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. దేశంలో ప్రతిరోజు మహిళలు, యువతులు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. అనంతరం చైతన్య కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్, టీపీజేఏసీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ముత్తయ్య, సభ్యులు ప్రకాష్, సత్యనారాయణ, పెన్షనర్స్ సంఘం రాష్ట్ర నాయకుడు యాదయ్య, చైతన్య మహిళా సంఘం సభ్యురాలు సత్య, టీవీవీ రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్, సభ్యుడు నక్కబాల్‌రాజ్, సీఎల్‌సీ రాష్ట్ర కార్యదర్శి తిరుమలయ్య, టీపీఎఫ్ నాయకుడు అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

‘జాతీయస్థాయి ప్రేరణ’కు ఎంపిక

గుజరాత్‌లో శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొననున్న విద్యార్థులు


అక్షర లక్ష్మి


భానుప్రసాద్

మహేశ్వరం: జాతీయస్థాయి ప్రేరణ శిక్షణకు మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌కి చెందిన విద్యార్థిని హెచ్.అక్షర లక్ష్మి శుక్రవారం ఎంపికయ్యారు. గత మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, మోడల్ స్కూల్‌లలో చదువుతున్న విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం సంబంధించిన అంశాలపై పోటీలు నిర్వహించారు. బాలికల విభాగం నుంచి మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థి హెచ్.అక్షర లక్ష్మి ఎంపిక చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ నుంచి 25వ వరకు గుజరాత్ రాష్ట్రంలోని వాదానగర్‌లో శిక్షణ తరగతులు ఉంటాయి. ఈ శిక్షణలో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికితీసే విధంగా ప్రేరణ కల్పిస్తారు. ఎంపికైన విద్యార్థిని మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస చారి, జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు, మండల విద్యాధికారి కృష్ణయ్య, అకాడమీ మానిటరింగ్ అధికారి జయచంద్రరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ అభినందించారు.

ఎలిమినేడులో మరో విద్యార్థి

ఇబ్రహీంపట్నం: జాతీయస్థాయి ప్రేరణ శిక్షణకు మండలంలోని ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నేరేళ్ల భానుప్రసాద్ బాలుర విభాగంలో ఎంపికయ్యారు. ఈ ప్రేరణ 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసేందుకు వివిధ అంశాలపై పోటీ పరీక్షను నిర్వహిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్ తెలిపారు. ఎంపికకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో వికసిత్ భారత్ అనే అంశంపై భానుప్రసాద్ ప్రతిభను కనబరిచారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొత్తూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అర్జునయ్య(45) గురువారం మధ్యాహ్నం తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఒంటిపై రక్తగాయాలు కనిపించడంతో మృతుడి కూతురు సుప్రజ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు రామచంద్రయ్య(51) భారతమ్మ గత నెల 27న వివాహానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో మండలంలోని హేంలాల్ ఫంక్షన్‌హాల్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పింది. దీంతో ఇరువురూ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో భారతమ్మ స్వల్ప గాయాలతో బయట పడింది. భర్త రామచంద్రయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామచంద్రయ్య శుక్రవారం ఉదయం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందజేశారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన చంద్రయ్యగౌడ్ కిరాణాషాపుపై పక్కా సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ మేరకు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై చంద్రయ్యగౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రంజిత్‌రెడ్డి చూపు చేవెళ్ల భూములపైనే

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కెఎస్.రత్నం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, నాయకులు

చేవెళ్ల: రంజిత్‌రెడ్డి చూపు చేవెళ్ల ప్రాంతంలోని భూములపైనే కాని ప్రజలపై కాదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కెఎస్.రత్నం ఆరోపించారు. మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డిలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. చేవెళ్లలో రంజిత్‌రెడ్డి రోడ్‌షోలో విశ్వేశ్వర్‌రెడ్డిపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజల ఓట్ల కోసం కన్నేసిన రంజిత్‌రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఎవరో తెలియని నిన్ను కేసీఆర్ చేవెళ్ల ఎంపీగా తీసుకు వచ్చి గెలిపిస్తే వచ్చావన్నారు. ఇప్పుడు అక్కడ మళ్లీ సీటు ఇస్తామని చెప్పినా నమ్మిన పార్టీని మోసం చేసి అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండాలని కాంగ్రెస్ పార్టీలో చేరిన వ్యక్తి రంజిత్‌రెడ్డి అన్నారు. ఐదేళ్లలో నీ ఫాంహౌస్‌కు రోడ్డు వేసుకున్నావు కాని పక్కనే ఉన్న గ్రామాలకు రోడ్డు వేయించిన పాపాన పోలేదన్నారు. ప్రభుత్వ నిధులతో చేవెళ్ల స్టేడియం నిర్మిస్తే దానికి మరమ్మతులు చేసి ఇక్కడి నాయకుడు ఇంద్రారెడ్డిపేరును తొలగించి నీ పేరు పెట్టుకుంటావా.. ఇదేక్కడి దుర్మార్గం.. హేయమైన చర్య అన్నారు. హనుమంతుడి గుడి జాగాను కబ్జాచేసి నీవు కేటీఆర్ కలిసి అపార్టుమెంట్లు కట్టుకుంటున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. మచ్చలేని వ్యక్తి విశ్వేశ్వర్‌రెడ్డి అని. ఆయనను నీవు విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయనకు నీవు సవాలు విసరడం కాదు అన్ని ఆధారాలతో నేను సిద్ధంగా ఉన్నాను. నాతో నీవు మాట్లాడు నీ జాతకం మొత్తం బయట పెడతా అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మోదీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ విష ప్రచారం చేస్తోందన్నారు. రాజ్యాంగం మారుస్తారని ఎవరూ చెప్పారన్నారు. ఈ మాయ మాటలు ప్రజలు నమ్మరన్నారు. చేవెళ్ల ప్రజలు చైతన్యవంతులని ఈ వలస నాయకులకు తగిన బుద్ధి చెబుతారని స్థానిక నాయకుడు తాతల కాలం నుంచి జిల్లాకు సుపరిచితులు, ప్రజల సేవకోసం వచ్చిన నాయకుడు విశ్వేశ్వర్‌రెడ్డి అని ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవుని శర్వలింగం, నాయకులు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, కృష్ణమోహన్, రాంచంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


కోనాపూర్ గేటు వద్ద బోల్తా పడిన వాటర్ ట్యాంకర్

ఆమనగల్లు: మండలంలోని కోనాపూర్ గేటు వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం వాటర్ ట్యాంకర్(ట్రాక్టర్) అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని గేటు తండాకు చెందిన నరేశ్ వాటర్ ట్యాంకర్‌లో నీటిని నింపుకొని కోనాపూర్ వెళుతుండగా గేటు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నరేశ్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం


సందీప్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి పట్టణంలోని కమ్మదనం బైపాస్‌పై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని రతన్ కాలనీకి చెందిన సందీప్(16) భగత్‌సింగ్ కాలనీకి చెందిన తన స్నేహితుడి ఇంట్లో నిద్రించాడు. గురువారం అర్ధరాత్రి సందీప్ వ్యక్తిగత పని నిమిత్తం కమ్మదనం బైపాస్ రహదారికి వెళ్లాడు. నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న సందీప్‌ను హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న టావేరా వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎఎస్ఐ రాంచందర్ ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి


కొత్తపల్లిలో కవాత్ చేస్తున్న పోలీసులు

యాచారం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రశాంతతపై అవగాహన కోసం శుక్రవారం మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలతో కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుధం అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ రాజు, సీఐ శంకర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో నీటమునిగి బాలుడి మృతి
- దేవునిఎర్రవల్లిలో విషాద ఛాయలు


రామకృష్ణ (ఫైల్)


మృతదేహాన్ని బయటకు తీస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: రేయింబవళ్లు శ్రమించి విద్యాబుద్ధులు నేర్పించిన తల్లిదండ్రులకు ఓ కుమారుడు తీరని గర్భశోకం మిగిల్చాడు. సరదాగా బావిలోకి ఈతకు వెళ్లి తిరిగిరాని లోకాలకు చేరి పుట్టెడు దుఃఖంలోకి నెట్టి వేశాడు. ఈ విషాద సంఘటన చేవెళ్ల మండలంలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎదిరే విఠలయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు రామకృష్ణ(16) గ్రామంలోని పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావటంతో ఆయన స్నేహితులతో కలిసి సమీపంలోని బావిలోకి ఈతకు వెళ్లారు. వెళ్లిన వారందరికీ ఈత రావడంతో బావిలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో రామకృష్ణ పైనుంచి బావిలోకి డైవ్ కొట్టి తిరిగి పైకి రాలేదు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న స్నేహితులు ఎవరూ గమనించలేదు. కాసేపటికి బావిలో దూకిన రామకృష్ణ కనిపించటం లేదని మిగతావారు వెతికారు. దీంతో విషయాన్ని కుటుంబసభ్యులు, గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు బావిలో ఉన్న నీళ్లను మోటార్ సహాయంతో బయటకు తోడేశారు. అనంతరం దిగి వెతకడంతో బావిలో అడుగున ఉన్న బురదలో డైవ్ కొట్టినట్లుగానే ఇరుక్కుపోయి విగతజీవిగా ఉన్న రామకృష్ణను బయటకు తీశారు. అప్పటికే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బావి వద్దకు చేరుకున్నారు. చేతికి వచ్చిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. వారి రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. ఈతకొట్టే సమయంలో మృతుడు డైవ్‌కొట్టిన సమయంలో గమనించక ఎవరైనా పైన దూకి ఉండవచ్చునని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేశ్

షాద్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్ సూచించారు. బండారి రాజయ్య–లక్ష్మమ్మ సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అంబలి, చలి వేంద్రాలను పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి, చలి వేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎండాకాలంలో గత 25 ఏళ్లుగా అంబలి, తాగునీరు పంపిణీ చేస్తున్నామన్నారు. జీవితంలో మనం ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సమాజానికి ఎంత సేవ చేశామనేది ప్రధానమని అన్నారు. ప్రతిఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని, సమాజానికి మనవంతుగా సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, రవీందర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్, వెంకటేశ్‌గుప్తా, సుధాకర్, మల్లికార్జునప్ప, సత్యనారాయణసింగ్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రిజర్వేషన్లకు రక్షణ

పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్


మాట్లాడుతున్న గౌరీ సతీష్

మొయినాబాద్‌రూరల్: కుల గణన చేసి రిజర్వేషన్లను పెంచిన బీహార్ ప్రభుత్వాన్ని 60 రోజుల్లోనే కూల్చిన ద్రోహి బీజేపీ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో గల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు కుల గణన చేపట్టిన మొట్టమొదటి రాష్ట్రం బీహార్ అన్నారు. అక్కడ రిజర్వేషన్లు 50–60 శాతానికి పెంచారని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకే కాదని ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల ఈబీసీ రిజర్వేషన్లను బీహార్ ప్రభుత్వం పెంచిందన్నారు. దీన్ని తట్టుకోలేక జేడీయూ, ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని బీజేపీ రెండు నెలల్లోనే కూల్చి వేసిందన్నారు. రిజర్వేషన్ల పెంపు లేదని కుల గణన నివేదికను మూలకు నెట్టారని తెలిపారు. అట్టడుగు వర్గాలకు ఉన్న రిజర్వేషన్లు అంటే బీజేపీకి గిట్టదన్నారు. రిజర్వేషన్లను కాపాడుకోవాలన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ వర్గాలు ఎన్నికల్లో బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వంలో రేషన్ కార్డులు, వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఒక్కరూపాయి పింఛన్ పెంచిన దాఖలాలు లేవన్నారు. దేశంలో ఒక్క ప్రభుత్వ పరిశ్రమను నిర్మించలేదని నయాపైసా నల్లధనం తెలేదన్నారు. తెలంగాణకు ఒక్క నవోదయ, కేంద్రీయ విద్యాలయం ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

టీకేఆర్ కళాశాలలో వార్షికోత్సవాలు


మ్యూజికల్ నైట్‌కు హాజరైన విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) మ్యూజికల్ నైట్‌లో సింగర్ కార్తీక్

మీర్‌పేట: మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు ‘పిజ్నే–2024’ పేరిట మ్యూజికల్ నైట్‌కు ప్రముఖ తెలుగు సింగర్ కార్తీక్ లైవ్ కాన్సెర్ట్ ఉర్రూతలూగించింది. కార్తీక్ పాడిన పాటలకు విద్యార్థినీ, విద్యార్థులు నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. వేడుకలో కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి, కార్యదర్శి తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి పాల్గొన్నారు.